# ఒక పారంపర్యాచారం ఎప్పుడు చెడ్డదవుతుంది?

### మత్తయి 15:7-20; మార్కు 7:6-8, 14-23, పరిశీలన

గత ప్రసంగంలో, "పారంపర్యాచారమంటే" – ప్రాథమికంగా (ముందటి వారి నుండి) "అప్పగింపబడిందని" మనం నేర్చుకున్నాం. దేవుని నుండి అందింపబడిన వాటిని గూడా యిలా సూచింపవచ్చు. అయితే యివి సాధారణంగా మానవుల నుండి అందింపబడిన వాటికి వర్తింపజేస్తాం. పారంపర్యాచారం మనుష్యుని నుండి కలిగినంత మాత్రాన అవి చెడ్డవి అనవలసిన అవసరం లేదనుకున్నాం. ఏదియెలాగున్నా, మత్తయి 15, మార్కు 7లో పారంపర్యాచారాలకు వ్యతిరేకంగా ప్రభువైన యేసు గట్టిగా మాట్లాడినందున, పారంపర్యాచారాలు తప్పు కావచ్చు, చాలా తప్పు కావచ్చు. ఒక పారంపర్యాచారం తప్పు అయినట్లయితే, దాన్ని నిర్ణయించడానికి కనీసం మూడు సంగతులను మన లేఖన భాగం తెలిపింది. "వ్యక్తపరచబడిన దేవుని ఆజ్ఞను పారం పర్యాచారం ఉల్లంఘించినప్పుడు అది చెడ్డది" అని మనం మొదటిగా చర్చించాం.[1] తక్కిన రెండింటిని ఈ చర్చలో పరిశీలించుదాం. అలా మనం చేసేటప్పుడు, మనలో ప్రతి ఒక్కడు తనను తాను పరిశీలించుకొందాం (2 కొరింథీ. 13:5)!

### ఇతరులను బంధించునప్పుడు పారంపర్యాచారము[2] చెడ్డదైయుంటుంది (మత్తయి 15:7-9; మార్కు 7:6-8)

క్రీస్తు పరిసయ్యులతో మాట్లాడుతున్నప్పుడు, ఆయన మాటలను బహు సూటిగా పలికారు: "వేషధారులారా – ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరతురుగాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు అని యెషయా మిమ్మును గూర్చి ప్రవచించిన మాట సరియే" (మత్తయి 15:7–9). ఈ కొటేషన్ యెషయా 29:13 నుండి తీయబడింది. ఆ లేఖన భాగంలో, తన కాలంలోని వేషధారులను ప్రవక్త ఖండిస్తున్నాడు. తన కాలపు మత నాయకులకును ఆ మాటలు సరిగా వర్తిస్తాయని ప్రభువు అంటున్నారు.

యెషయా మాటలనుండి పలు ముఖ్యమైన పాఠాలను తీసికోవచ్చు: "పెదవులతో పలకడం" సరిపోదు; దేవునికి మన విధేయత హృదయంనుండి రావాలి (మత్తయి 22:37; రోమా 6:17; ఎఫెసీ. 6:6; కొలస్సీ. 3:16; 2 కొరింథీ. 9:7). మన ఆరాధన హృదయ

పూర్వకమయ్యిందీ, పరలోకపు అధికారంతో కూడిందీ కానట్టయితే, అది "వ్యర్థమైనదే."[3] మన ప్రస్తుతపు చర్చలో, ఈ కొటేషన్‌లో చివరి భాగం మీద దృష్టి నిలుపవలసిందిగా కోరుతున్నాను. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచున్నారట. మనుష్యులు కల్పించిన పద్ధతులు దేవుని సిద్ధాంతాలని బోధించడం మోసం. పరిసయ్యులకు పారంపర్యాచారాలు ఎంత ప్రాముఖ్యమైనా, అవి మనుష్యుల మూఢ నమ్మకాలేగాని, దేవుని ఉపదేశాలుకావని గ్రహించాలని ప్రభువు కోరారు.

**అవి ఆజ్ఞలైనట్టు పారంపర్యాచారాలను రుద్దడం**

ప్రతి భోజనానికి ముందు విస్తృతమైన ఆచార కర్మకాండను పరిసయ్యులు చేసికొన్నందుకు క్రీస్తు వారిని ఖండించారా? లేదు. అర్థరహితమైన ఆచారాలతో వారు తమ కాలాన్ని వ్యర్థం చేసికొంటే, అది వారి పని. ప్రభువు పరిసయ్యులను ఖండిస్తుంది వారి ఆచరణను బట్టికాదుగాని వారు తమ ఆచారాలను యితరుల మీద రుద్దుతున్నందుకే. వారు తమ ఆచారాలను దైవికమైన ఆజ్ఞల అంతస్థుకు పెంచారు. మనుష్యులు వారి పారంపర్యాచారాలను అనుసరించవలసిందని బోధించారు. వాటిని అనుసరించని వారిని ఖండించారు. రెండవ విషయాన్ని యిలా వర్ణించుదాం: ఇతరులను బద్ధులనుగా చేసినప్పుడు ఒక పారంపర్యాచారం తప్పు అవుతుంది.

కనీసం సూత్రంలోనైనా అలాటి అచరణ తప్పని, ప్రతి ఒక్కరు చూడగలరు. సంవత్సరాలలో, మా కుటుంబం కొన్ని ప్రత్యేకమైన పారంపర్యాలను ఏర్పరచుకుంది.– ప్రత్యేకించి సెలవు దినాలు యింకా యితర ఉత్సవాలు. వీటిని మేము ఎంజాయ్ చేస్తాం. మేము ఎవరమో అని నిర్వచించడానికి సహాయపడతాయి. వాటిని యితరుల మీద రుద్దడానికి ఏ ప్రయత్నమూ చేయం. మా కుటుంబ పారంపర్యాలను యితర యిండ్లమీద రుద్దడం, వారు వాటిని అనుసరించనందుకు నేరస్థులుగా ఎంచడం మతిహీనత ఔతుంది.

మత సంబంధమైన మన పారంపర్యాలను యితరులపై రుద్దడం తప్పని క్రీస్తు ప్రభువు తేటగా తెలిపారు. ఈ సూత్రాన్ని వర్తింపజేసినప్పుడే వితర్కం ఏర్పడుతుంది. తాము ఉన్న రీతిగానే కొనసాగడం ప్రజలకు సహజమైన సౌకర్యంగా ఉంటుంది. అలాగే ఉండాలని మనం కోరుకొంటూ ఉంటాం. అయినా, ఏది మార్చడానికి వీలుండదు (బయలు పరచబడిన దేవుని చిత్తం) ఏది మార్చడానికి వీలుంటుంది (ఆయన చిత్తాన్ని జరిగించే పద్ధతులకు) అనే వాటిమధ్య మనం వ్యత్యాసం చూడడానికి ప్రయాసపడాలి.

ఆరాధనకున్న పరిధినుండి ఉదాహరణలు జ్ఞాపకం వస్తున్నాయి:[4] అనేక స్థానిక సంఘాలలో పాతల పుస్తకాలు ఉపయోగిస్తారు, అయితే తెరమీద పాటను ప్రదర్శింపిజేయు స్థానిక సంఘమును చూచి నిందించవచ్చునా?[5] నేను ప్రసంగించే స్థానిక సంఘాల్లో ప్రార్థన, పాటలు, లేఖన పఠనం, ప్రసంగం, ప్రభురాత్రి భోజనం, కానుకల సమర్పణ అనేవి ఆ క్రమంలో జరుగుతాయి. ఆదివారం ఆరాధనలో జరిగే ప్రతి కార్యక్రమమును ప్రభువు బల్లపై కేంద్రీకరిస్తాం.[6] నేను కూడి ఆరాధించే స్థానికసంఘం ఆరాధనకు కూడుకొను భవనంలో రాత్రియందు ఆరాధనను జరిగించుదురు. మరొక స్థానిక సంఘం ఆదివారపు ఆరాధనను ఒక గృహములో జరిగిస్తున్నయెడల అట్టి కార్యక్రమం

లేఖనానుసారమైనది కానిదా?[7] "అది అభ్యాససిద్ధమైనదా?" అని నేను అడగడంలేదు. అది "లేఖనానుసారమైనదా?" అని అడుగుతున్నా.

ఆరాధనను[8] గూర్చిన ప్రాథమికమైన నమూనాను క్రొత్త నిబంధన మనకిస్తుంది కాని అందులోని కొన్ని వివరాలను మన నిర్ణయానికి వదలిపెట్టింది. ప్రతి స్థలంలోను ఈ క్రమంలోనే కార్యక్రమాలు జరగాలా? ఆ క్రమంలోనే జరగాలని బంధించడం తప్పు ఔతుంది. కొన్ని చోట్ల ప్రసంగానికి ముందు ప్రభురాత్రి భోజనం చేసి, కానుకల సమర్పణ కూడా ముగించి చివరిగా ప్రసంగం జరిగించడం వాడుక. ఇలా జరుగకూడదని అనడానికి మనకు హక్కు లేదు. లేక యిలాగే జరగాలని వారిని బంధించడం కూడా తప్పే ఔతుంది. అయితే ఒక మాట. ఆదివారం కూడికనుండి కానుకల సమర్పణ, ప్రభు రాత్రి భోజనాలను ఎత్తివేయడానికి మనకు హక్కు లేదు. అవి దేవునిచే నియమింపబడినవి. దేవునిచే ఆదేశింపబడిన వాటినీ (దైవీకమైన మాదిరిని) ఆ ఆదేశాలను చేపట్టుటలో మానవుడు ఉపయోగించిన మార్గాలకునూ గల వ్యత్యాసాన్ని గుర్తించాలి.[9]

ఉదాహరణకు ప్రభురాత్రిభోజనమును ఆరాధన కార్యక్రమములో ఆరంభములో లేక ఆఖరిలో జరిగించవచ్చు. కొన్ని సార్లు కానుకలను పోగుచేయడమనేది ప్రభు రాత్రి భోజనమునకు ముందుగానో తరువాతనో జరిగించటం వాడుకై[10] ఉండవచ్చు. క్రొత్తగా సంఘమును దర్శించిన ఒకరు ప్రభు రాత్రి భోజనం అయిన తరువాత కానుకలు పోగుచేయకుండా ఉండడం చూచి, "ఎలాంటి సంఘమునకు వచ్చాను" అని వాపోయింది. ఆమె "లేఖనానుసారమైన ఆరాధనా కార్యక్రమాల"[11] క్రమం లేదని నమ్మింది. ఆమె అనుకున్న క్రమములో లేనందున "లేఖనానుసారం కాదన్నది."

ఈ ప్రాథమిక సూత్రాలను మనం యింకా అధికంగా నొక్కి చెప్పలేం. అయితే దేవుని ఆజ్ఞలు, మానవ పారంపర్యాలు అనే వాటి మధ్య వ్యత్యాసాన్ని చూడడం అత్యవసరం. మనం స్వంతంగా చేసికొన్న ఆచారాలను యితరులపై రుద్దడం తప్పవుతుంది. ఇంతవరకు మనం అంగీకరించామన్న తలంపుతో ప్రాముఖ్యమైన ప్రశ్నను ఆలోచించుదాం: దేవుని అజ్ఞలకును మానవ పారంపర్యాలకును మధ్య మనం ఎలా విభజన చేస్తాం?

**పారంపర్యాచారాలకు ఆజ్ఞలకు మధ్య వ్యత్యాసం**

కొంత కాలంగా అచరణలతో ఉన్నదాన్ని "సంప్రదాయం" అనడం మొదలైయింది. అంటే పాతదని, ప్రస్తుతానికి వర్తించదని, దానికి అంత ప్రాముఖ్యతలేదని, దాన్ని మినహా యింపుగా తీసివేయవచ్చనే తత్వం వినవస్తుంది. ఉదాహరణకు, "ట్రెడిషన్నల్ ఫామిలీ"[12] (అంటే, కుటుంబం తల్లి, తండ్రి, పిల్లలతో కూడింది) గౌరవంలేని రూపంగా ఉపయోగింప బడింది. బైబిలునందు విశ్వాసముంచే వారికి, ఈ ఏర్పాటు ఎంతకాలం నుండి ఉందనేది ప్రాముఖ్యం కాదు. అయితే ప్రాముఖ్యమైన ప్రశ్న ఏమంటే: "ఇది మనుష్యుని నుండి కలిగిందా లేక దేవుని నుండి కలిగిందా?" (మత్తయి 21:25).

ప్రభువు సంఘం యొక్క నమ్మకమైన స్థానిక సంఘాలు ("traditional churches") "పారంపర్యపు సంఘాలు" అని సూచింపబడినప్పుడు నాకు బహు బాధకలుగుతుంది. ఎందుకంటె వారు నమ్మేది అనుసరించే పారంపర్యపు స్థితిగా కొట్టి వేయబడుతుంది.

ఈలాటి కాగితాలు అంటించేవారు – విశ్వాస విషయంగా ఏమి చేస్తారు, అభిప్రాయ రూపంగా ఏమి చేస్తారు అనేదాని మధ్య ఎక్కువ వ్యత్యాసం చేయరు.

గతంలో సంఘాన్ని ఏది బాధించిందో దానినంతటిని ఒక ముద్దచేసి, అంతా (సమస్తము) అభిప్రాయాలకు సంబంధించినవేనని, అందులో పెద్దగా ప్రత్యేకత ఏమీ లేదని చెప్పిన అధ్యాపకులను నేను విన్నాను. వెనుకకు తిరిగి చూచి, కొన్ని సంఘర్షణలు అనవసరమేనని నేను అంగీకరిస్తాను, కాని సంఘం పోరాటం జరిగించిన ప్రతి ప్రశ్నను కొట్టివేయడం ధర్మమా అని నేనడుగుతున్నా. ఆది సంఘాన్ని వేదించిన యూదా మతము, జ్ఞాన తత్వవాదము అనే వాటి సమస్యలను సంఘం తక్కువ చేసినట్టయితే దైవ ప్రేరేపితులైన రచయితలు ఎలా రియాక్ట్ అయ్యేవారు?

దీనిపై అంగీకారానికి వద్దాం: ఇతరుల మీద రుద్దినప్పుడు మానవ పారంపర్యం చెడ్డదే. కాలంతో ఏకీభవించదని మనం తలంచినందువలన, ఏ విశ్వాసమేగాని లేక అచారమేగాని పారంపర్యానికి సంబంధించినట్టు వర్గీకరించకూడదనే దాని గురించి కూడా ఏకీభవించుదాం.

దేవుని ఆజ్ఞలకును మానవ పారంపర్యాచారాలకును మధ్య వ్యత్యాసాలకు సంబంధించినది కీలకమైన ప్రశ్నయని నేను చెప్పాను. ఈ ప్రశ్నకు నీకు జవాబు తెలుసు. మరియు ఈ ప్రసంగంలో యిది పలుమార్లు సూచింపబడింది. లేఖనాలు బోధించే వెలుగులోనే మనం నమ్మే, బోధించే సమస్తము పరిశీలింపవలసి ఉంటుంది. “మనం ఎల్లవేళ్లలా ఏమి చేశాం?” అనేది ప్రశ్నకాదు. మనం ఎలా చేయనిష్టపడతాము? అనే ప్రశ్న కుడా కాదు. “బయలుపరచబడిన తన చిత్తమందు దేవుడు ఏమి బోధిస్తాడు?” అనేదే ప్రశ్న (అపొ. 17:11 చూడు). ప్రభువు వినియోగించిన పదాలను ఉపయోగించుదాం (మత్తయి 21:25). ఆ బోధగాని, ఆచరణగాని పరలోకమునుండి కలిగినట్లయితే, అది ప్రతి క్రైస్తవుని బద్దునిగా చేస్తుంది. అది “మనుష్యుని నుండి” కలిగినట్టయితే, యితరుల మీద దాన్ని రుద్ది దోషులమై యుండకూడదు.

ఈ జవాబు యివ్వడంలో, ఏది “పారంపర్యాచారం,” ఏది కాదు? అనే దానికి జవాబును సెటల్ చేశానా? అడుగదగిన ప్రతి ప్రశ్నకు జవాబు యిచ్చానా? లేదు, లేదు. నా ఉద్దేశమేమంటే – ఒక విషయానికి గలరెండు కొనలను పట్టుకొని వ్రేలాడవద్దని. అవి ఎంతమంచిగా ఉన్నా, మన పారంపర్యాలను అనుసరించని వారిని ఖండించవద్దు. అదే సమయంలో, కొన్ని సంవత్సరాలుగా మన మధ్య లేనందున, మత సంబంధమైన బోధను గాని ఆచారాన్నిగాని – పారంపర్యాచారమని కొట్టివేయనూ వద్దు. క్రొత్త నిబంధన శతాబ్దాల తరబడి ఉంది. మత సంబంధమైన ఏ ఉపదేశమైనా ఆచరణయైనా, అంగీకరించడానికి లేక నిరాకరించడానికి ముందు దేవుని వాక్యము యొక్క ఉపదేశము ప్రమాణముగా నిలుపుకుందాం.

పూర్వకాలము, ఆయన యొద్దనుండి దేవుని ప్రజలకు యెహోషువ ఈ సందేశానిచ్చాడు: “అయితే నీవు నిబ్బరము గలిగి జాగ్రత్తపడి బహు ధైర్యముగానుండి, నా సేవకుడైన మోషే నీకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమంతటి చొప్పున చేయవలెను. నీవు నడుచు ప్రతిమార్గమున చక్కగా ప్రవర్తించునట్లు నీవు దానినుండి కుడికిగాని యెడమకుగాని

తొలగకూడదు” (యెహోషువ 1:7; 23:6 కూడా చూడు). దేవుడు బంధించని వాటిని (మానవ పారంపర్యాచారాలను) బంధించడాన్ని “కుడికి తిరగడమని” – దేవుడు బంధించిన వాటిని (బయలుపరచబడిన ఆయన చిత్తాన్ని) విడిపించడాన్ని “ఎడమకు తిరగడమని” మనం అనుకోవచ్చు. ఈ అంతాలలో దేనికి పోకుండ మన హృదయాలను నిలుపుకుందాం. క్రీస్తు యొక్క క్రొత్త నిబంధనలో వ్రాయబడిన ఉపదేశమంతటి చొప్పున చేయ తీర్మానించుకుందాం!

ఈ ఆలోచనను మనం ముగించవచ్చు – క్రీస్తు మాత్రం తన చర్చను ముగించలేదు. మానవ పారంపర్యాచారమును గూర్చి కనీసం ఆయనకు యింకో పాయింటు ఉంది. ఈ సత్యం అంత తేటగా లేదు, అయినా ప్రాముఖ్యమైనదే. ముందు రెండు విషయాలు ఎంతగా హృదయాన్ని పరిశీలించుకునేవిగా ఉన్నాయో యిది కూడా అలాగే ఉంది – యిది ఒక వేళ యింకా ఎక్కువే కావచ్చు.

## పారంపర్యాచారము అనవసరమైన ప్రాముఖ్యతను పొందినప్పుడు, అది చెడ్డది (మత్తయి 15:10-20; మార్కు 7:14-23)

ప్రభువైన యేసుకును పరిసయ్యులకును మధ్య జరిగిన వివాదము రహస్యంగా జరిగింది కాదు. కఠిన హృదయులైన నాయకుల యెదుట తన్నుగాని, తన శిష్యులనుగాని సమర్థించుకోవలసిన అవసరత ప్రభువునకు లేదు. కాని ఆలకించేవారు ఈ వివరణ పొందనర్హులని ఆయన యోచించారు. లేవనెత్తబడిన ప్రాథమిక సమస్యపైన ఆయన చేసిన ప్రసంగాన్ని మార్కు ఒక్క వచనంలోనికే కుదించాడు:

> అప్పుడాయన జనసమూహమును మరల తన యొద్దకు పిలిచి – మీరందరు నా మాటవిని గ్రహించుడి. వెలుపల నుండి లోపలికి పోయి మనుష్యుని అపవిత్రునిగా చేయగలుగునది ఏదియు లేదుగాని, లోపలనుండి బయలు వెళ్లునవే మనుష్యుని అపవిత్రునిగా చేయుననెను (మార్కు 7:14, 15).

తక్కిన విషయాల మధ్య ప్రతి భోజనానికి ముందు ప్రక్షాళమునకు (కడుగుకొనుటకు) సంబంధించిన కట్టుబాట్లను పాటించడం (అవివేకం) తార్కిక జ్ఞానసూన్యం – అని ప్రభువంటున్నారు. వాస్తవానికి, మనిషి లోపలికి వెళ్లేది, కడగని చేతులతో[13] చేసే భోజనంతో సహా – మనిషిని అపవిత్రపరచదు. (మత్తయి 15:20బి). తనలో నుండి వచ్చే దానిని బట్టి – (అంటే మనిషి మాటలు, కార్యాలు) ఒకడు అపవిత్రుడు కాగలడు.

కర్మకాండకు సంబంధించిన ప్రక్షాళనములను మించినది క్రీస్తు ప్రతిపాదనయందు గుప్తమైయుంది. క్రీస్తు చెప్పినదాని నుండి మార్కు ఒక్క ముగింపును ప్రస్తావించుతున్నాడు: “ఇట్లు అది భోజన పదార్థములన్నిటిని పవిత్రపరచును”[14] (మార్కు 7:19బి). ఆ శ్రోతలకు ప్రభువు మాటలు ఎంత రాడికల్‌గా వినిపించియుంటాయో క్రొత్త నిబంధన ఉపదేశముతో పరిచయమున్న మనకు గ్రహించడం కష్టం. యూదుడు ఏది తినవచ్చో, ఏది తినకూడదో

(లేవీ. 11) చిన్ననాటి నుండి ధర్మశాస్త్రపు ఆజ్ఞగా ఎరిగియుంటాడు (అపొ. 10:14 చూడు). క్రీస్తు మాటలు ఎంత విభ్రాంతి కలిగిచాయంటే, ఆయన తన శిష్యులతో ఒంటరిగా ఉన్నప్పుడు, ఆ "ఉపమానాన్ని వివరించుమని" పేతురు ప్రభువును అడిగాడు (మత్తయి 15:15). "ఉపమానము" అని పేతురు ఉపయోగించడంలో, ఆ ప్రతిపాదన తప్పక అక్షరార్థంగా తీసికోకూడదని పేతురు తలంచాడు.[15]

"మీరును ఇంత అవివేకులై యున్నారా?" అని అనడంలో క్రీస్తు తన తలను ఆడించియుండవచ్చు (మత్తయి 7:18ఎ). జనసమూహాలు గ్రహించకపోతే అయన ఆశ్చర్యపడలేదు. కనీసం తన అపొస్తులులకు ఎక్కువ గ్రహింపు ఉంటుందని ఆయన నిరీక్షించియుంటారు. అయినా, ఆయన శాంతంగా యిలా వివరించారు: "వెలుపలినుండి మనుష్యుని లోపలికి పోవునదేదియు వానినపవిత్రపరచజాలదని మీరు గ్రహింపకున్నారా? అది వాని హృదయములో ప్రవేశింపక కడుపులోనే ప్రవేశించి బహిర్భూమిలో విడువ బడును" (మార్కు 7:18బి, 19ఎ). తినడం, బయటికి పోవడం అనేది ప్రకృతి సిద్ధమైన విధానం. అది మనుష్యుని నైతిక విలువకు సంబంధం లేనిది.

"ఈ సూత్రాన్ని స్వనాశనానికి సంబంధించిన వస్తువులకు, అంటే, మత్తు కలిగించే సారాయి లేక ఏ రకమైన వేషాల్ని సేవించడానికి వర్తింపజేయడం పూర్తిగా వక్రంగా తిప్పు ప్రయత్నించడమే" అని R. C. Foster అన్నాడు.[16] నోటిగుండా వెళ్లే కొన్ని పదార్థాలు హానికరమై యుంటాయి. "నీవు నోట నుండి దానిని పడవేయి" అని ఎన్నిసార్లు తలిదండ్రులు తమ చిన్న పిల్లలతో అంటూ ఉంటారు. దేహము "పరిశుద్ధాత్మకు ఆలయం" (1 కొరింథీ. 3:16, 17; 6:19). ఆ ఆలయానికి హాని కలిగించే దేనినైనా వదలుకోవాలి. అయినా హానికరమైన వాటిని ప్రభువు మనస్సులో ఉంచుకొని ఈ సంగతులు పలుకలేదు. ఆయన అక్కర ఆరోగ్యకరమైన ఆహారాన్ని గూర్చియే – కడుగని చేతులను బట్టి అది "అపవిత్ర మని" యూదులు భావించారు.

అయన తన వివరణను యిలా కొనసాగించారు:

> మనుష్యుని లోపలినుండి బయలు వెళ్లునది మనుష్యుని అపవిత్రపరచును లోపలనుండి, అనగా మనుష్యుల హృదయములో నుండి దురాలోచనలును జారత్వములును దొంగతనములును నరహత్యలును వ్యభిచారములును లోభములును చెడుతనములును కృత్రిమమును కామ వికారమును మత్సరమును దేవదూషణయు అహంభావమును అవివేకమును వచ్చును. ఈ చెడ్డవన్నియు లోపలనుండియే బయలువెళ్లి, మనుష్యుని అపవిత్రపరచునని ఆయన చెప్పెను (మార్కు 7:20–23).

**అప్పుడు అది హృదయ సమస్య**

జాబితాలో ఉన్న "దుష్ట కార్యాలను" గూర్చి ఎంతైనా చెప్పవచ్చు, కాని నేను "హృదయము" అనే పదం మీద దృష్టిని కేంద్రీకరించబోతున్నాను. పరిసయ్యుల ప్రాథమిక సమస్య హృదయ సమస్య అని ఈ కథ అంతటిలో ప్రభువు నొక్కి చెప్పుతున్నారు. గతంలో, ఆయన ఆ ప్రతిపాదన చేసింది ఎందుకంటే, వారు దేవుని హృదయ పూర్వకంగా ఆరాధించడం (మత్తయి 15:8; మార్కు 7:6). ఇక్కడ ఆయన చెప్పేదేమంటే – వారి దృష్టి బాహ్యమైనదాని

మీద ఉంది, అంతరంగమందు వారు దృష్టి నిలిపేదానికి బదులుగా, లోపలికిపోయే దానిమీద వారు మాట్లాడారు. మంచి, చెడ్డ అనే దానికి మూలము హృదయం.

ఒక పారంపర్యాచారం చెడ్డదా కాదా అనే దానిని తీర్మానించడానికి చెప్పబడ్డ మూడవ లక్షణము: తగని ప్రాముఖ్యతను, సంక్రమింపజేసినప్పుడు ఒక పారంపర్యాచారం చెడ్డదవుతుంది. ఆత్మసంబంధమైన ప్రాధాన్యతను మార్చి మనకు యిచ్చినప్పుడు లేదా దేవుని ఆజ్ఞలకు లోబడడానికి బదులు యిది ప్రాముఖ్యమైన ఆచరణగా అది దాని నావరించినప్పుడు – వారి పారంపర్యాచారాలలో పరిసయ్యులు ఎంతగా కూరుకు పోయారంటే, వారు దేవుని ఆజ్ఞలను సయితం అలక్ష్యం చేశారని క్రీస్తు అన్నారు (మార్కు 7:8).

### నేటి హృదయ సమస్య

ముందుగా చెప్పినట్టే, ఒక పారంపర్యాచారం చెడ్డదా మంచిదా అని తీర్మానించే లక్షణాలలో, పారంపర్యాచారానికి తగని ప్రాధాన్యత లేక ప్రాముఖ్యతను యివ్వడమనేది తక్కినవాటికంటె బహు కుయుక్తితో కూడినదైయుంది. పరీక్ష సంపూర్ణమైనది కాకపోయినప్పటికిని అది ప్రాముఖ్యమైనది. ఈ మూడవ అపాయము మనం చర్చించిన రెండింటి కంటెను ఎక్కువైనదై యుంది. దేవుని ఆజ్ఞలకు బదులు నీవు నేను మన పారంపర్యాచారాలను ప్రతిక్షేపం చేయకపోవచ్చు. మన పారంపర్యాలను ఆచరించనందుకు మనం యితరులపై తప్పు మోపక పోవచ్చు. అయినా, మన పారంపర్యాచారాలు మనకు ఎంత ప్రాముఖ్యమైనవంటే, ప్రజలు దేవునికి అవిధేయులైనప్పుడు మనం చేసేదానికంటే వారు వాటిని నిర్లక్ష్య పెట్టినప్పుడు ఎక్కువ తీవ్రంగా ఆగ్రహిస్తాం.

“అలాటి ప్రజలను నేనెరుగుదునని” నీవు అలోచిస్తూ తల ఊపుతున్నావా? ఇది యితరులకు వర్తింపజేసే సూత్రం కాదు. ఇది వ్యక్తిగతంగా వర్తింపజేసికోవలసిన సూత్రమే. నేను యింకొక వ్యక్తి హృదయాన్ని ఎరుగలేను. ఒక మనుష్యునికి తన పారంపర్యాచారాలు మితిమించి ముఖ్యమైనవై యుండవచ్చు, అయితే ఆ విషయం నాకు తెలియదు. ఇద్దరు వ్యక్తులు ఒకే రకమైన పారంపర్యాచారాలను ఆచరించవచ్చు, వారిలో ఒకడు సరియైన దృక్పథంతో మరొకడు దాని స్వరూపాన్ని వక్రీకరించి ఆచరించవచ్చు. ఈ విషయంలో యితరులకు తీర్పుతీర్చే దోషము చేయకుందము గాక (మత్తయి 7:1, 2; రోమా 2:1); మనలో ప్రతి ఒక్కడు తన్ను తానే తీర్పు తీర్చుకొందము గాక.

## ముగింపు

పారంపర్యాచారాలపై ప్రభువు చర్చను ముగించక ముందు, దైవ ప్రేరేపితంకాని ప్రాచీన శ్లోగన్ ఒకటి జ్ఞాపకం వస్తుంది: “విశ్వాస విషయాల్లో ఏకత్వము, అభిప్రాయముల విషయాల్లో స్వాతంత్ర్యము; అన్ని విషయాలలో ప్రేమ” కలిగియుందాం అనేది. ఈ కార్యసాధనలోని మూడు భాగాలు మూడు ప్రశ్నలను సూచిస్తున్నాయి. మత సంబంధంగా మనం అడుగవలసిన మూడు ప్రశ్నలివి.

**“విశ్వాస విషయాలలో, ఏకత్వం.”** విశ్వాస విషయం అనేది దేవుడు తన వాక్యంలో

తెలియజేసిన దానికి సంబంధించినది (రోమా 10:17). అలాటి విషయాలలో, మనం ఏకమైయుండాలి (1 కొరింథీ. 1:10). మనం అడుగవలసిన మొదటి ప్రశ్నను యిది సూచిస్తుంది: "నేను బోధించి జరిగించే వాటికి నాకు బైబిలు అధికారం ఉందా?" "ఇది ఎంత కాలంగా ఇలా చేయబడుతుంది?" అనేది కాదు. "ఇది ఎక్కడ ప్రారంభమైనది" అనేది ప్రాముఖ్యమైన ప్రశ్నయైయుంది. ఏ ఆచరణకైనా యిదే ప్రాముఖ్యం.

**"అభిప్రాయముల విషయంలో స్వతంత్రం."** అభిప్రాయమనేది దేవుడు తన గ్రంథంలో దేన్ని గూర్చి మాట్లాడలేదో దానికి సంబంధించింది. ఇందులో వ్యక్తిగతమైన తీర్మానం ఉంటుంది. అలాటి విషయాల్లో, మన అభిప్రాయాలను యితరుల మీద రుద్దకూడదు. "స్వాతంత్ర్యమనేది"[17] ప్రాముఖ్యమైన పదం. ఎడతెగక హృదయ పరిశోధనను చేసి కొనడానికి యిది పిలుపునిస్తుంది. "కాలమును బట్టి, ఆజ్ఞవలెనే ప్రాముఖ్యత నా మనస్సులో సంక్రమించుకొని ఒక ఆజ్ఞను అనుసరించే క్షేమాభివృద్ధికరమైన మార్గముందా?"

**"అన్ని విషయములలో ప్రేమ."** తీర్మానముల విషయంలో సహ క్రైస్తవుడు నాతో ఏకీభవించనప్పుడు, మనం యింకా అతని ప్రేమించాలి (యోహాను 13:35; రోమా 12:10). ప్రాథమికమైన ఈ సూత్రం అలక్ష్యం చేసినందుననే సహోదరులు దూరమయ్యారు. స్థానిక సంఘాలు విభజించబడ్డాయి. ప్రతిఒక్కరు ఈ ప్రశ్నడగాలి: "లేఖనాలను ఉల్లంఘించని, చట్టంగా బంధింపబడని హానిలేని పారంపర్యాచారుల పట్ల క్రీస్తువంటి తత్వం నాకుందా?" కేవలం ఎల్లప్పుడు మనం అదే విధంగా చేస్తాం గనుక అలాగే చేయాలని నిర్బంధించడం అవివేకం. వ్యత్యాసంగా ఉండడానికిగాను వేరు విధంగా చేయాలని నిర్బంధించడం కూడా అవివేకమే.[18] అభిప్రాయాలమీద అంగీకారం కుదరనప్పుడు, ప్రేమ, కనికరము, సున్నిత స్వభావం కలిగియుండాలి.

పారంపర్యాచారము అనే అంశం సంయుక్తమయ్యింది. ప్రాథమిక సూత్రాలను ప్రతిపాదించడం కష్టం కాదుగాని, వాటిని వర్తింపజేయడమే కష్టం. అంటే, ఈ అంశం ప్రాముఖ్యం కాదని గాని, లేక మత్తయి 15లోను మార్కు 7లోను దాఖలు చేయబడినట్టు యేసు బోధించిన సూత్రాలకు విధేయులు కావలసిన అవసరం లేదని గాని దాని అర్థం కాదు. గాని, సమాధానాలన్నీ, తన యొద్దనే ఉన్నాయని ఎవరును ధైర్యంగా చెప్ప పనిలేదు. మనం చదవాలి, పరిశీలించాలి లేచే "సమస్యలను" పరిశోధించడానికి సిద్ధపడాలనే దాని భావం. అంటే, మనం ఒకరియెడల ఒకరం ఓర్పుగలవారమై యుండాలి (ఎఫెసీ. 4:2).

పారంపర్యాచారాలు అనే అంశం అంత కష్టం ప్రతి అంశం ఉండదు గనుక నేను ఆనందిస్తాను. ఉదాహరణకు, పాపమునుండి రక్షణ అనే విషయాన్ని గూర్చి ఆలోచించు. ప్రభువు తన మార్గాన్ని స్పష్టంగా కనుపరచడం అద్భుతం కాదా? క్రీస్తు మనలను ప్రేమించి మన పాపముల కొరకు మృతి పొందారు (యోహాను 3:16; 1 కొరింథీ. 15:1-3). ఇప్పుడు మనము ప్రేమతో కూడిన విధేయతతో స్పందించాలి (యోహాను 3:16; మార్కు 16:16; అపొ. 22:16). పారంపర్యాచారాలను గూర్చి మనకు జవాబులన్నీ లేకపోవచ్చు, కాని అతి ప్రాముఖ్యమైన ప్రశ్నకు మనం జవాబు కనుగొనవచ్చు: "రక్షింపబడుటకు నేనేమి చేయాలి?" (అపొ. 2:37, 38; 8:36-38; 16:30-33 చదువు). పారం పర్యాచారాలు అనే ప్రశ్నతో జీవితమంతా పోరాడవచ్చు. కాని ఆయన చిత్తాన్ని

జరిగించడంలో ఒక క్షణం కూడా జాప్యం చేయకూడదు. నీవు ఆయనకు లోబడవలసి యుంటే, యిప్పుడే ఆ పని చేయి!

---

## సూచనలు

[1]“పారంపర్యాచారం చెడ్డదైనప్పుడు” అనేదాన్ని రివ్యూ చేయవచ్చు. [2]“పారంపర్యాచారాలంటే” ముందుగా ప్రస్తావించబడినట్టే – మనుష్యుల పారంపర్యాచారాలనే యిక్కడ సూచింపబడింది. [3]“వ్యర్థమైన” అంటే ఉపయోగంలేని, పనికిరాని అని అర్థం (ప్రసంగి 1:14లో గమనించు). [4]అవసరతను బట్టి వర్తింపజేయాలి. [5]ప్రతి ప్రశ్న తరువాత దానికి జవాబు “లేదు” అనేదని అర్థమవుతుంది. [6]బ్రిటిష్ పూర్వచరిత్రగల స్థానిక సంఘంలలో ఇలాటి ఆరాధన కార్యక్రమం ఉంటుంది. [7]ఆదివారం రాత్రి గృహములో ఆరాధించడాన్ని కొందరు ప్రశ్నిస్తారు. ఇది లేఖనాలకు సంబంధించిన ప్రశ్న కాదు. [8]“రక్షణను గ్రహించుట” అనే పుస్తకం చూడు. [9]ఏవి విశ్వాసానికి సంబంధించినవి, ఏవి అభిప్రాయాలకు సంబంధించినవో వ్యత్యాసం చూపాలి. [10]ప్రభువు రాత్రి భోజనం వేరే – కానుకలు సమర్పణ వేరే ఆ రెండు ఒక్క భాగమే కాదు.

[11]తాను ఎదురు చూచినప్పుడు కానుకలు సమర్పింపబడినందున – అది లేదని కాదు. [12]“పారంపర్య కుటుంబం” దేవుని నుండి వచ్చినదై, ఆదికాండం తొలి అధ్యాయాల నుండి వస్తున్నది. దేవుని వాక్యమునుండి తొలిగిపోయి అలాటి కుటుంబ ఏర్పాటునుండి తొలిగిపోతున్నారు “స్వలింగ వివాహం,” “వివాహంనకు బయట కలిసి జీవించడం” అనువాటిని జరిగిస్తున్నారు. [13]తల్లులు శుభ్రతను కోరి భోజనమునకు ముందు చేతులు కడుక్కోవాలని పిల్లలకు చెప్పుతారు. యేసు మాట్లాడుతున్నది కర్మకాండమును గూర్చి. [14]ఈ సంగతిని శిష్యులు అప్పుడే గ్రహించారని కాదు. క్రీస్తు చెప్పిన దానిలో నుండి ఈ తీర్మానం తప్పించుకోలేనిదని దైవ ప్రేరేపితులైన లేఖకులు వెనుకకు చూచారు. [15]మార్కు 7:14,15లోని భావాలతో అపొ. 10 సంఘటనల వరకు పేతురు పెనుగులాడాడు. [16]R. C. Foster, *Studies in the Life of Christ* (Grand Rapids, Mich.: Baker Book House, 1971), 669. [17]సంఘమును, క్రైస్తవులను బాధించునట్టుగా మన స్వతంత్రమును ఉపయోగించరాదని బైబిలు తెలుపుతుంది (1 కొరింథీ. 8:9 చూడు). [18]కొంతమంది, కొన్ని స్థానిక సంఘాలు భిన్నంగా ఉండాలనుకుంటారు. వారి మార్గం శ్రేష్ఠమైనదని రుజువైనందున కాదు గాని, “పారంపర్య సంఘం”పై తిరుగుబాటు భావం కలిగినందుననే. ఆ ప్రవర్తన “పసిపిల్లల ప్రవర్తన.” విభిన్నంగా ఉండాలి గనుక విభిన్నంగా ఉండాలి అనేది విలువలేనిదై యుంది.